## పెనుబల్లి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

పెనుబల్లి, జనవరి 30: మండలంలోని అడవిమల్లెల పీహెచ్‌సీని మంగళవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా నాణ్యమైన సేవలు అందించేందుకు ఆరోగ్య సేవలు, మాత, శిశు సంరక్షణ సేవలు, కుటుంబ నియంత్రణ, సాధారణ ప్రసవాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రికి ప్రతిరోజు రోగులు ఎంత మంది వస్తున్నారు. ఇన్‌పేషంట్స్ ఎంతమంది అడిగి తెలుసుకున్నారు. కుక్క, పాము కాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఫార్మసిస్ట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లె దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొణిజర్ల, జనవరి 30: మండలంలోని తుమ్మలపల్లి, తీగల బంజర గ్రామంలో పల్లెదవాఖానాలను మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ ఆసుపత్రిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తీగలబంజరలో పల్లెదవాఖానా నిర్మాణానికి స్థలాన్ని వితరణగా అందించిన స్థానికుడు కుంచెపు రాంబాబును ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, సర్పంచ్‌లు కమటాల రేణుక, షేక్ అబ్బులీల్, స్థల దాత కొంచెం రాంబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### కారేపల్లిలో...

కారేపల్లి, జనవరి 30: మండలంలోని విజీపీయా తండాలో అంగన్‌వాడీ భవనం, బజ్జతండా, పాత కమలాపురం గ్రామపంచాయతీ భవనాలను మంగళవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. అనంతరం భవనాల నిర్మాణానికి స్థలాన్ని వితరణగా ఇచ్చిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు శకుంతల, జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌నగర్ సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లి రూరల్, జనవరి 30: మండలంలోని కిష్టారం అంబేద్కర్‌నగర్ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ చెల్లమాల రేణుక, ఎంపీటీసీ పాలుర్తి సునీత ఆధ్వర్యంలో గ్రామస్తులు సింగరేణి జీఎం షాలెంరాజుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన సింగరేణి అధికారులు కాలనీలో పర్యటించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, పీవోలు వెంకటాచారి, నర్సింహారావు, సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్లేస్‌మెంట్స్‌లో 43 మంది విద్యార్థుల ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 30: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 43 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో సర్వీస్‌నౌ టెక్నీషియన్ ఉద్యోగాలకు వివిధ దశలలో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను కరస్పాండెంట్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ అభినందించారు.

## చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులే ముఖ్యం

కూసుమంచి,జనవరి 30 : రైతులు వ్యవసాయానికి అనుబంధంగా చేపల చెరువులు చేపుకోవాలని తద్వారా మంచి ఆదాయం వస్తుందని సీనియర్ శాస్త్రవేత్త శ్యాంప్రసాద్ అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహాయంతో ప్రభుత్వం చేపడుతున్న చేపల పెంపకంలో మెరుగైన విధానాలు అనే అంశంపై మూడు రోజుల శిక్షణ పాలేరులో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శాంతన్న మాట్లాడుతూ చేపల మేత విషయంలో తీసుకోవాల్సిన వాటి గురించి వివరించారు. బ్లాక్ టెక్నికల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీడ్ స్టాకింగ్ చేపల పిల్లల రవాణా విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శాస్త్రవేత్త రవీందర్ మాట్లాడుతూ నీటి యాజమాన్య పద్ధతులు వివరించారు.

## పీవోపీ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

కూసుమంచి, జనవరి 30: ఎరువు దుకాణ దారులు పీవోపీ మిషన్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలని అధిక ధరలకు అమ్మినా రైతులు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకుంటామని ఏడీఏ విజయ్ చంద్ర అన్నారు. కూసుమంచి, జక్కేపల్లిలోని దుకాణాలను మంగళవారం తనిఖీ చేసి మాట్లాడారు.

## నిరుపేదలకు పండ్లు, భోజన ప్యాకెట్లు అందజేత

రఘునాథపాలెం, జనవరి 30: నగరానికి చెందిన బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు పండ్లు, భోజన ప్యాకెట్లను ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కుక్కల ప్రవళిక, కాటికాపరుల జాంబవ సొసైటీ సభ్యులు పండి వేణు, సైదులు, పడిశాల వీరస్వామి, కాశయ్య, చుక్కయ్య పాల్గొన్నారు.

## 4 నుంచి ఓపెన్ డిగ్రీ తరగతులు ప్రారంభం

సత్తుపల్లి టౌన్, జనవరి 30: జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రంలో మొదటి సంవత్సర విద్యార్థులకు ఫిబ్రవరి 4 నుంచి మార్చి 3వ తేదీవరకు ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తున్నట్లు అధ్యయన కేంద్రం సమన్వయకర్త పి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7382929742లను సంప్రదించాలని ఆయన కోరారు.

# చాక్లెట్ల మాటున గంజాయి రవాణా

- ఖమ్మంలో బస్సు తనిఖీలో పట్టుబడిన మహారాష్ట్ర మహిళలు
- 8 కేజీల సరుకు, మరో 3 కేజీల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

మామిళ్లగూడెం, జనవరి 30: గంజాయి రవాణా రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. అధికారుల కళ్లుగప్పేందుకు అక్రమార్కులు కొత్తకొత్త దారులు వెతుకుతున్నారు. నేరుగా గంజాయి తరలించడంతోపాటు దానిని ఆయిల్, చాక్లెట్లు మార్చి రవాణా చేస్తున్నారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ ద్వారా తెలంగాణ మీదుగా ఈ సరుకు తరలిస్తున్నారు. ముఖ్యంగా భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు బస్సుమార్గంలో తరలిస్తున్నారు. అనేక చోట్ల పోలీసులు ఆ సరుకును పట్టుకుంటూనే ఉన్నారు. తాజాగా సోమవారం రాత్రి ఖమ్మంలో జరిగిన ఆకస్మికత తనిఖీల్లో మరికొందరు నిందితులు పట్టుబడ్డారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-2 సీఐ రాజిరెడ్డి మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళలు ఇటీవల ఒడిశా వెళ్లారు. అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరుకు చేరుకున్నారు. అక్కడ గుర్తుతెలియన వ్యక్తుల నుంచి పకడ్బందీగా ప్యాక్ చేసిన 8 కేజీల గంజాయిని, చాక్లెట్లుగా మార్చిన మరో 3 కేజీల గంజాయి ప్యాకెట్లను తీసుకున్నారు. అక్కడి నుంచి బస్సులో భద్రాచలానికి చేరుకున్నారు. అక్కడి నుంచి మరో బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఆ బస్సు ఖమ్మం సరిహద్దులోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే.. సీఐ విజేందర్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ బస్సును ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో రాఖీ గణేశ్ చౌహాన్, బాలీ వసంత్ సూలంకే అనే ఇద్దరు మహిళల బ్యాగుల్లో ఈ గంజాయి ఉంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాటిని గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 2.50 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. చాక్లెట్లుగా మార్చిన గంజాయి ప్యాకెట్లపై చార్మినార్ గోల్డ్ పేరుతో లోగో ఉందని తెలిపారు. విచారణ అనంతరం రిమాండ్ నిమిత్తం నిందితులను న్యాయస్థానానికి తరలించినట్లు చెప్పారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, గంజాయి చాక్లెట్లతో ఎక్సైజ్ అధికారులు

# సత్యం, అహింసలే మహాత్ముని ఆయుధాలు

### ఎమ్మెల్యే మట్టా రాగమయి



సత్తుపల్లి, జనవరి 30: సత్యం, అహింసలే ఆయుధాలుగా మహాత్మా గాంధీ స్వాతంత్ర్యం సాధించారని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాపు మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని ఆకాంక్షించారు.

**పెనుబల్లిలో..**

పెనుబల్లి, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతిని వీఎం బంజర రింగ్ సెంటర్‌లో హమాలీలు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత హమాలీ సంఘ నాయకులు మిద్దె స్వామి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళి అర్పించారు.

**సండ్ర క్యాంపు కార్యాలయంలో..**

సత్తుపల్లి టౌన్, జనవరి 30: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య క్యాంపు కార్యాలయంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. తొలుత మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

**సమరయోధుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలి..**

మామిళ్లగూడెం, జనవరి 30: స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సీపీ సునీల్‌దత్, జిల్లా అధికారులతో కలిసి ఐడీవోసీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పాల్గొన్నారు.

**త్రివేణి పాఠశాలలో..**

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 30: నగరంలోని త్రివేణి పాఠశాలలో జాతీయ అమరవీరుల దినోత్సవం, మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, కృష్ణవేణి-త్రివేణి విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మధిరలో...**

మధిర, జనవరి 30 : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని మధిర గ్రేటర్ వాసవీ క్లబ్ యూత్, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**తిరుమలాయపాలెంలో..**

తిరుమలాయపాలెం, జనవరి 30 : మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీతో పాటు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

# టీఆర్‌ఎస్‌కేవీతోనే సమస్యల పరిష్కారం

**రాష్ట్రస్థాయి సమావేశానికి తరలివెళ్లిన జిల్లా నాయకులు**

ఖమ్మం, జనవరి 30: బీఆర్‌ఎస్ అనుబంధ తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌ఎస్‌కేవీ)తోనే విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బానోత్ ఉపేందర్, యూ.శ్రీనివాస్ అన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే పలు సమస్యలను సంఘ రాష్ట్ర, జిల్లా నాయకుల సహకారంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సంఘం రాష్ట్రస్థాయి సమావేశానికి ఖమ్మం నుంచి వారు వెళ్లే ముందు జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యుత్‌రంగంలోని కార్మికులందరికీ టీఆర్‌ఎస్‌కేవీ అండగా నిలుస్తూ వస్తోందని అన్నారు. సంఘం నాయకులు ఎస్‌కే షరీఫ్‌మియా, రమేశ్, నాగేశ్వరరావు, తిరుపతిరావు, రమేశ్ పాల్గొన్నారు.

## వన్‌టౌన్ సీఐగా ఉదయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

మామిళ్లగూడెం, జనవరి 30: ఖమ్మం వన్‌టౌన్ సీఐగా ఉదయ్‌కుమార్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ప్రస్తుతం వన్‌టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న స్వామి.. ఖమ్మం సీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ఉదయ్‌కుమార్ ఖమ్మం వన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు.

## కరాటేలో రెజోనెన్స్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 30: నగరంలోని రెజోనెన్స్ శ్రీనివాసనగర్ పాఠశాల విద్యార్థులు కరాటేలో రాష్ట్ర స్థాయి అండర్-14లో ప్రథమ స్థానం సాధించారని డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్ తెలిపారు. స్పారింగ్‌లో నేహుజ్వల్, కటాస్‌లో యశ్వంత్ పతకాలు సాధించారన్నారు.

## ముగిసిన జాతీయ స్థాయి సదస్సు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 30: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఫిజిక్స్ జాతీయ స్థాయి సదస్సు మంగళవారంతో ముగిసింది. పలువురు ప్రొఫెసర్లు 'రోల్ ఆఫ్ బైసిందోల్స్ ఇన్ డిజైనింగ్ ఆఫ్ యాంటీ క్యాన్సర్ డ్రగ్ క్యాండిడేట్స్' అనే అంశంపై ప్రసంగించారు. 143మంది పరిశోధనా పత్రాలు అందజేశారు. సదస్సులో ప్రొఫెసర్లు నరేశ్, చంద్రశేఖర్, వెంకట శ్రీనివాస్, జాకీరుల్లా, పద్మావతి, దర్గన్ పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు అంకితభావంతో పనిచేయాలి..

ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సేవా దృక్పదం కలిగి అంకిత భావంతో పనిచేయాలని కేయూ ప్రొఫెసర్ నారాయణ అన్నారు. మంగళవారం కవితా మెమోరియల్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సమావేశం నిర్వహించారు.

## అభివృద్ధి పనులకు సహకరించడం లేదు

కొణిజర్ల, జనవరి 30: మండలంలోని గుబ్బగుర్తి గ్రామ పంచాయతీలో మంజూరైన పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే సహకరించడం లేదని బీఆర్‌ఎస్ సర్పంచ్ మీర్జారోశన్‌బేగ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

# ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

- అది వందశాతం కచ్చితత్వంగా, పారదర్శకంగా ఉండాలి
- ఓటర్ల జాబితా జిల్లా పరిశీలకురాలు బాలమాయాదేవి
- ఆర్వోలు, ఏఆర్వోలతో ఖమ్మంలో సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, జనవరి 30: జిల్లాలో ఓటర్ల జాబితాను వంద శాతం పారదర్శకంగా సిద్ధం చేయాలని ఖమ్మం జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకురాలు, చీఫ్ రేషనింగ్ అధికారి బీ.బాలమాయాదేవి సూచించారు. ఎస్‌ఎస్‌ఆర్-2024 ఓటరు జాబితా రూప కల్పనపై కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి ఖమ్మం ఐడీవోసీలో ఆర్వోలు, ఏఆర్వోలతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌ఎస్‌ఆర్-2024 ప్రక్రియలో ప్రతి అంశంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఫొటో సిమిలర్ ఎంట్రీ, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీల విషయమై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ.. సూచించిన కాలపరిమితితో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాల పేరు మార్పుకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. వందేళ్ల పైబడిన ఓటర్ల విషయమై క్షేత్ర తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్‌ఎస్‌ఆర్ కార్యాచరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ స్థాయిలో ప్రతీ బుధవారం, జిల్లా స్థాయిలో ప్రతీ గురువారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గత పబ్లికేషన్ నుంచి ఈ నెల 6న డ్రాఫ్ట్ పబ్లికేషన్ వరకు 3,073 ఓటర్లను చేర్చామని, మరో 3,037 మంది ఓటర్లను తొలగించామని చెప్పారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకారం జిల్లాలో మొత్తం 12,16,832 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఇతర అధికారులు జీ.గణేశ్, అశోక్ చక్రవర్తి, ఎం.రాజేశ్వరి, కే.శ్రీరామ్, ఏ.శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎండుగంజాయి పట్టివేత

కొణిజర్ల/వైరా టౌన్, జనవరి 30: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జీ నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం కొణిజర్ల శివారులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఇద్దరు వ్యక్తుల నుంచి 15 కేజీల ఎండుగంజాయిను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఆకాశ్‌సింగ్, రూపేశ్‌సింగ్‌గా గుర్తించారు. గంజాయి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు రమ్య, కిరిటీ, మమత, సిబ్బంది బాస్య, రవి, సీతారాం, శ్రావణ్ కుమార్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

## వసతిగృహంలో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

పెనుబల్లి, జనవరి 30: ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని కుప్పెనకుంట్లలోని టీఎస్‌డబ్ల్యూఆర్ జేసీ బాలుర వసతిగృహంలో మంగళవారం చోటు చేసుకున్నది. 6వ తరగతి చదువుతున్న సాళ్వం రాజుపై అదే తరగతికి చెందిన 13 మంది విద్యార్థులు మూడు రోజుల క్రితం హాస్టల్ రూంలో బంధించి కాళ్లు, చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు పెట్టి కర్రలతో కొట్టడంతో రాజు చెయ్యి విరిగి, ఒంటిపై తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే మళ్లీ కొడతామని బెదిరించడంతో ఎవరికీ చెప్పలేదు. పాఠశాల ఆవరణలోకి వచ్చిన రాజు కింద పడిపోవడంతో గమనించిన ఉపాధ్యాయుడు ఒంటిపై ఉన్న గాయాలను చూసి అడగడంతో జరిగిన విషయం తెలిపాడు. రాజు తల్లిదండ్రులను, దాడి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి దాడి చేసిన విద్యార్థులను హెచ్చరించారు. రాజు తల్లిదండ్రులు వీఎం బంజర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సురేశ్ బుధవారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపడతామని తెలిపారు.

## వేధింపులపై కేసు నమోదు

చింతకాని, జనవరి 30 : రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎన్ కొండమ్మను వేధిస్తున్న అత్త, ఆడపడుచు ఆమెభర్తపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా కొండమ్మను సదరు వ్యక్తులు ఆస్తి పంపకం విషయంలో గొడవ పడుతూ వేధిస్తున్నారు. దీంతో కొండమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్ ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

## వేర్వేరు ప్రాంతాల్లో రైలు కిందపడి ఇద్దరు మృతి

చింతకాని, జనవరి 30 : ప్రమాదవశాత్తూ రైలు కిందపడి ప్రొద్దుటూరుకు చెందిన మోతరపు మధుసూధన్‌రావు(53) మృతిచెందాడు. వైద్యం నిమిత్తం చెన్నైకి వెళ్తూ మార్గమధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున తాగునీటి కోసం రైలు దిగి ఎక్కుతున్న సమయంలో నిద్రమత్తులో కాలుజారి కదులుతున్న రైలుకిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెన్నై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మధిరలో...**

మధిరరూరల్, జనవరి 30 : రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. మధిర- తొండలగోపవరం మధ్య ఎగువ రైలు పట్టాలపై రైలు కింద పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఖమ్మం జీఆర్‌పీ ఎస్సై పీ.భాస్కర్‌రావు కేసు నమోదు చేయగా మధిర ఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జి ఎస్.వేణుగోపాల్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు 9963641484, 8712658589 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్న లారీ..

తిరుమలాయపాలెం, జనవరి 30 : మాదిరిపురం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున టాటా ఏస్ వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం,, సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బద్యాతండాకు చెందిన రైతు ఎన్.హుస్సేన్ టాటా ఏస్ వాహనంలో మిర్చి బస్తాలు తీసుకొని ఖమ్మం మార్కెట్‌కు బయలుదేరాడు. మాదిరిపురం సమీపంలోకి వెళ్లాగానే ఆ వాహనానికి ఫంక్చర్ కావడంతో డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన పెట్టి బస్తాలపై కూర్చుని ఉన్నాడు. మరిపెడబంగ్లా నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వెళ్లి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో హుస్సేన్‌కు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ముదిగొండ, జనవరి 30 : ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకున్నది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం. పమ్మి గ్రామానికి చెందిన బాపట్ల వీరబాబు(30) ఖమ్మంలోని మిర్చి మార్కెట్లో కలాసుగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే మార్కెట్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా చిరుమర్రి మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. వీరబాబుకు తీవ్ర గాయాలవగా 108లో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

## పోలీస్ కస్టడీలో పగడాల నాగరాజు విచారణ

మామిళ్లగూడెం, జనవరి 30: ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో ఇటీవల అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును టూటౌన్ పోలీసులు మంగళవారం న్యాయస్థానం అనుమతితో తమ కస్టడీలోకి తీసుకొని విచారణ చేపట్టారు. మూడు రోజులపాటు విచారణ కోసం నిందితుడిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు న్యాయస్థానంలో అప్పీల్ చేశారు. దీనిపై నాగరాజు తరపు న్యాయవాదులు కౌంటర్ ఫిటిషన్ వేశారు. 2వ ముద్దాయిగా ఉన్న వ్యక్తికి మూడు రోజుల విచారణ అవసరం లేదని, న్యాయవాదుల సమక్షంలో ఒక్క రోజు విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీంతో న్యాయస్థానం ఒక్కరోజు విచారణకు ఆదేశించింది. దీంతో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా జైలు నుంచి నాగరాజును తీసుకొచ్చిన పోలీసులు.. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం న్యాయవాదుల సమక్షంలో విచారణ చేపట్టారు. పలు లావాదేవీలపై ప్రశ్నలు అడిగారు. విచారణ ముగిసిన తరువాత సాయంత్రం 5:30 తరువాత తిరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసు విషయంలో న్యాయస్థానంలో నాగరాజు తరపున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ వేశారని, రెండు రోజుల్లో బెయిల్ వచ్చే అవకాశం ఉందని న్యాయవాది మేకల సుగుణాకర్‌రావు తెలిపారు.

# సంక్షిప్తం

## గ్రామదీపికలు, సీసీలకు శిక్షణ

కల్లూరు, జనవరి 30 : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ డీఆర్‌డీఏ ఉషోదయ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం స్త్రీ శక్తి భవన్‌లో గ్రామదీపికలు, సీసీలకు లోకోస్ యాప్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీసీలు పీ వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్యామలాదేవి, వాడపల్లి వెంకటరావమ్మ, రాధా రుక్మిణికుమారి, ఎస్‌కే ఫాతిమా, రాజ్యలక్ష్మి, ఎస్తేరు, ఆనందకుమారి, అకౌంటెంట్ అపర్ణలక్ష్మి, గ్రామదీపికలు పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 'నెక్స్ట్ లెవల్ నాలెడ్జ్ ఎక్స్‌పో'

కల్లూరు, జనవరి 30: స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం 'నెక్స్ట్‌లెవల్ నాలెడ్జ్ ఎక్స్‌పో'ను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో వివిధ రకాల పాఠ్యాంశాలను వినూత్న పద్ధతుల్లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బోధించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీఎం బంజర ఎస్‌హెచ్‌వోగా వెంకటేశ్

పెనుబల్లి, జనవరి 30: వీఎం బంజర ఎస్‌హెచ్‌వోగా కే వెంకటేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సత్తుపల్లి రూరల్ సీఐ హనుక్‌ను కలిసి పూలమొక్కను అందజేశారు. శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఉండేలా కృషి చేస్తానని వెంకటేశ్ అన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సత్తుపల్లి, జనవరి 30 : పట్టణంలో ఇండేన్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న జొన్నలగడ్డ శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇండేన్ గ్యాస్ యజమాని వందనపు సత్యనారాయణ, కోటగిరి సుధాకర్‌బాబు మంగళవారం శ్రీకాంత్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.45వేలు అందజేశారు.

## జన్య సైంటిఫిక్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్,జనవరి 30: నగరంలోని తిరుమలాయపాలెం గురుకుల పాఠశాలలో మంగళవారం జన్య సైంటిఫిక్ రంగోలి, సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. బోధనా, అభ్యాసన పరికరాల ద్వారా తరగతి గదిలో నేర్చుకున్న సైన్స్, గణిత అంశాలను విద్యార్థులు ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీ బోస్, ఉపాధ్యాయులు శివకుమార్, జాని పాల్గొన్నారు.

## పంచాయతీ భవనం కోసం స్థలం వితరణ

చింతకాని, జనవరి 30 : తిర్లాపురం గ్రామ సర్పంచ్ దంపతులు బండి రమాదేవి, రామారావు సుమారు రూ. 10 లక్షలు విలువ చేసే భూమిని పంచాయతీ భవన నిర్మాణానికి వితరణగా అందించారు. ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ దాతల సేవలు గ్రామాల అభివృద్ధికి దోహదం చేస్తాయని కొనియాడారు.

## ప్రకృతి ప్రేమికులకు సన్మానం

ఖమ్మం రూరల్, జనవరి 30: ఇటీవల గణతంత్ర దినోత్సవం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌చే సన్మానం పొందిన చిన్నారి విశ్వమిత్ర చౌహాన్‌ను పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులు మంగళవారం సన్మానించారు.

## పంచాయతీ పాలకవర్గం సభ్యులకు వీడ్కోలు

ఖమ్మం రూరల్, జనవరి 30: ఆరెంపుల పంచాయితీ పాలకవర్గం బాధ్యతలు నేటితో ముగియనుండడంతో మంగళవారం వీడ్కోలు సభ జరిగింది. సర్పంచ్ చింతమల్ల పద్మ మాట్లాడుతూ తమ పాలకవర్గానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సర్పంచ్‌తో సహా ఆరుగురి రిమాండ్

కూసుమంచి, జనవరి 30 : నర్సిహులగూడెం సర్పంచ్ జక్కుల వెంకటేశ్వర్లుతో సహా ఆరుగురిపై కేసు నమోదు కావడంతో పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు.వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింహులగూడెంలో గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన గొడవలో మారెపల్లి ఉపేందర్ రెడ్డిని కొట్టడంతో గాయాలయ్యా యి. ఉపేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘర్షణలో నర్సింహులగూడెం సర్పంచ్ జక్కుల వెంకటేశ్వర్లు, పెరుమళ్లపల్లి రామన్న, సుధాకర్, శీలం శంకర్, జక్కుల రాంమూర్తి, రమేశ్‌లపై కేసు నమోదు కావటంతో వారిని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రమేశ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కృత్రిమ పాదాల పంపిణీ

ఖమ్మం, జనవరి 30: ఖమ్మం గట్టయ్యసెంటర్ రోటరీ క్లబ్ లింబ్ కేంద్రంలో పదిమంది నిరుపేద దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వీల్‌చైర్లు, వాటర్ ఫిల్టర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిస్ట్రిక్ట్ గవర్నర్ -3150 ఆర్‌టీఎన్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

మామిళ్లగూడెం, జనవరి 30 : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రహదారి భద్రతపై సీపీ సునీల్‌దత్‌తో కలిసి డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కూడళ్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కె. శ్యామ్‌ప్రసాద్, డీసీహెచ్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా రవాణాధికారి గౌస్‌పాషా, డీపీవో హరికిషన్, ఏసీపీలు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1).TS28TA8841 MAXIMA CARGO-2022
2).TS28TA9582 BAJAJ RE CNG-2022
3).TS28TA7325 APE LD- 2021
4). TS28TA9769 BAJAJ RE CNG-2022
5).TS28TA9805-BAJAJ RE DIESEL -2022
Cell:7337394783
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616